ఎస్‌పిగా వకుల్ జిందాల్
దీపికా పాటిల్‌కు అనకాపల్లి బదిలీ

వకుల్ జిందాల్

దీపిక పాటిల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ఎస్‌పి ఎం.దీపికా పాటిల్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో 2016వ బ్యాచ్‌కు చెందిన వకుల్ జిందాల్ ఎస్‌పిగా నియమితులయ్యారు. బాపట్ల ఎస్‌పిగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి రానున్నారు. గతంలో రంపచోడవరంలో ఎఎస్‌పి, సిఎం పర్సనల్ సెక్యూరిటీ వింగ్ ఎస్‌పిగా పనిచేశారు. దీపికా పాటిల్ జిల్లా ఎస్‌పిగా 2021 జులై 12న బాధ్యతలు స్వీకరించి, మూడేళ్ల పాటు సమర్ధవంతంగా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత మైన వాతావరణంలో నిర్వహించారు. చింతలవలస వద్దనున్న ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్‌గా మల్లికా గార్గ్ బదిలీపై వస్తున్నారు.

మా వాళ్లొస్తారు.. పనిచేయండి

- అధికారుల చేతికి జనసేన నాయకుల జాబితా
- టిడిపి స్థాయి ఎమ్మెల్యే తగ్గిస్తున్నారని నాయకుల ఆవేదన
- జనసేనలోనూ మొదలైన సీనియర్, జూనియర్ల వైరం
- నెల్లిమర్లలో ముదిరిన కోల్డ్‌వార్



ప్రజాశక్తి- విజయనగరం

'మా వాళ్లొస్తారు.. పనిచేయండి' అని ఎమ్మెల్యే లోకం నాగమాధవి మండల స్థాయి అధికారుల చేతికి జనసేన నాయకుల పేర్లతో కూడిన జాబితాను ఇచ్చి ఆదేశించినట్లు తెలిస్తోంది. ప్రతి గ్రామానికి ఒక జనసేన నాయకుడుని ఎంపిక చేసి ఆయన పేరును తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ ఇతర అధికారులకు జాబితా రూపంలో పంపించారు. ఆ జాబితాలో ఉన్న వారు వస్తేనే అనుకూలంగా పనిచేయాలని, మిగిలిన వారొస్తే పట్టించుకోవద్దని చెప్పినట్లు సమాచారం. ముఖ్యంగా టిడిపి నాయకుల కంటే జనసేన నాయకులకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిస్తోంది. దీంతో టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవి విజయం కోసం అహర్నిశలూ కష్టపడి పనిచేస్తే ఇదేనా ఆమె తమకు ఇచ్చిన గౌరవం అంటూ మండిపడుతున్నారు. ఇదే విషయంపై ఇటీవల ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పూసపాటిరేగ మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూడా తెలుగు తమ్ముళ్లు ఆవేదన చెందారు. ఆమె విజయం సాధించినప్పటి నుంచీ టిడిపి నాయకులను చిన్న చూపు చూస్తున్నారని, సమావేశాలు, సభలు, ఇతర కార్యక్రమాలకు తమకు ఆహ్వానం కూడా ఇవ్వడం లేదని మండల స్థాయి టిడిపి నాయకులు సైతం ఎమ్‌పి ముందు ఏకరువు పెట్టారు.

ప్రోటోకాల్ పాటించకపోవడంపై మరో వివాదం

ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించకపోవడంపై సొంత పార్టీలోనే వివాదం రేగుతోంది. ఇటీవల జరిగిన కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పాల్గొన్నప్పటికీ తమకు సమాచారం ఇవ్వడం లేదని కొంత మంది ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఎంజెపి బిసి గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి సాక్షాత్తు నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజకు కూడా సమాచారం ఇవ్వలేదంటే అధికార యంత్రాంగం ప్రోటోకాల్ పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఆమె జనసేన పార్టీలోనే ఉండటం ఎమ్మెల్యే వస్తున్నారని తెలుసుకుని అప్పటికప్పుడు వెళ్లారు తప్ప అధికారులు ఆమెకు ఆహ్వానం ఇవ్వలేదు. అంతకముందు కొండపేటలో స్టూడెంట్ కిట్లు పంపిణీలో కూడా చైర్‌పర్సన్‌కు సమాచారం ఇవ్వకుండా అవమానించారు. నగర పంచాయతీలో పింఛన్ల పంపిణీలోనూ ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరించారు. మాధవి ఎమ్మెల్యే అయిన తరువాత ప్రోటోకాల్ లేకుండా వారికి ఇష్టమొచ్చిన వారిని పిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రోటోకాల్ విషయంలో అధిష్టానం వద్ద తేల్చుకుంటామని చైర్‌పర్సన్ గ్రూపు సభ్యులు బహిరంగంగానే చెబుతున్నారు.

జనసేనలోనూ మొదలైన కుమ్ములాట

ఎమ్మెల్యే లోకం నాగమాధవి తయారు చేసిన జాబితాతో ఆ పార్టీలో కూడా వైరం ప్రారంభమైంది. ఆమె అధికారుల చేతికిచ్చిన జాబితాలో మొదటి నుంచీ పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చినవారికి, కాస్త ఆర్థిక పరిస్థితి బాగున్న వారికే ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో గ్రామాల్లో జనసేన నాయకులు మధ్య చిచ్చు రేగింది. మొదటినుంచి పార్టీ జెండా పట్టుకుని ఆమె గెలుపు కోసం గత ఆరేళ్లగా పోరాటం కష్టపడిన నాయకులను పక్కకు నెట్టేసి కొత్తగా వచ్చిన వారి పేర్లను అధికారులకు ఇవ్వడం పట్ల సీనియర్ జనసేన నాయకులు మండిపడుతున్నారు. సాక్షాత్తు నెల్లిమర్ల జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పేరు కూడా ఆ జాబితాలో లేకపోవడంతో ఆ మండలాలోని జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు. పార్టీకోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి కొత్త వారికెందుకు అవకాశం ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తూ ఆమెకు సెల్‌ఫోన్ ద్వారా సందేశాలు పంపారు. స్పందించిన ఎమ్మెల్యే ఎవరూ అధైర్యపడొద్దని కచ్చితంగా జాబితా మారుస్తానని చెప్పినట్లు తెలిసింది.

విజయనగరంలో జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

జిపిఎస్ అమలుపై
భగ్గుమన్న గురువులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆందోళనలు ● గెజిట్ కాపీలు దగ్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/బొబ్బిలి

సిపిఎస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ గెజిట్‌ను, జీవో 54ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్ కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ గెజిట్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ శనివారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం గెజిట్ కాపీని మంటల్లో వేసి దగ్ధం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను అమలు చేసేందుకు జీవో 54ను తీసుకొచ్చిందన్నారు. నేడు తెలుగుదేశం ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. వెంటనే ఆ గెజిట్‌తో పాటు జీవో 54ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, తిరుపతి నాయుడు, ఎన్.సత్యన్నారాయణ, జి.రాజారావు, పి..రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సిపిఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జిపిఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. గెజిట్ నోట్‌కు వ్యతిరేకంగా శనివారం పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. గెజిట్ నోట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరుతుంటే, జిపిఎస్ అమలు చేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం జిపిఎస్‌ను జిఒ 54తో అమలు చేస్తామని చెపితే పోరాటాలతో అడ్డుకున్నామని చెప్పారు. 2023 అక్టోబర్ నుంచి జిపిఎస్‌లోకి ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీసుకువస్తూ గెజిట్ నోట్ విడుదల చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, నాయకులు సుధాకర్, మహేష్, వరప్రసాద్, స్వామినాయుడు, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల యుటిఎఫ్ నాయకులు శ్రీనివాస్, రాధాకృష్ణ, శంకర్రరావు, రామారావు, నాగేశ్వరరావు, మహేష్, సత్యనారాయణ, కృష్ణదాసు, శ్రీనివాస్, సుధాకర్, మన్యం జిల్లా నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : స్థానిక ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన జిపిఎస్ గెజిట్‌ను దగ్ధం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కిల్లాడ అప్పారావు, బొండపల్లి, మెంటాడ మండలాల అధ్యక్షులు కె..శ్రీనివాసరావు, ఆదాడ సూరిబాబు, నాయకులు ఆర్.సన్యాసిరావు, వానపల్లి సత్యనారాయణ, బివికె శేఖర్, ఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

బొబ్బిలి, గజపతినగరంలో జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

జవానుకు కన్నీటి వీడ్కోలు

శంకరరావు భౌతికకాయం వద్ద గౌరవవందనం సమర్పిస్తున్న ఆర్మీ ఉద్యోగులు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని బొత్సవానివలస గ్రామానికి చెందిన జవాను గొట్టాపు శంకరరావు భౌతికకాయానికి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు, సైనికులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. సైనిక లాంఛనాలతో శనివారం జవాను స్వగ్రామం బొత్సవానివలసలో అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం ఉదయం లడక్ ప్రాంతంలో ఆక్సిజన్ సిలిండర్ పేలిన ఘటనలో శంకరరావు మృతిచెందిన విషయం తెలిసిందే. శంకరరావు భౌతికకాయాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసేందుకు గ్రామస్తులతోపాటు స్నేహితులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. తన భర్తను చూసిన భార్య కోమలత ఆయన భౌతికకాయంపై పడి బోరున విలపించింది. తల్లిదండ్రులు అప్పలనాయుడు, సావిత్రమ్మ, సోదరులు, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. ఆ దృశ్యాలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. జవాను భౌతికకాయాన్ని ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యేలు తెంటు లక్ష్మునాయుడు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, డిఎస్‌పి శ్రీనివాసరావు, జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సత్యప్రసాద్, తదితరులు సందర్శించి, నివాళులర్పించారు. సైనికులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

సైనికుడికి ఘన నివాళి

బొబ్బిలి : లడక్‌లో ఆక్సిజన్ సిలిండర్ పేలిన సంఘటనలో మరణించిన జవాను గొట్టాపు శంకరరావుకు మాజీ సైనికులు ఘనంగా నివాళు లర్పించారు. పట్టణంలో వీర సైనికుని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం పని చేసిన శంకరరావు మరణం బాధాకరమని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రేవాళ్ల కిరణ్, కోశాధికారి శర్మ, మాజీ సైనికులు విచారం వ్యక్తంచేశారు.

ఎన్ఇపిని రద్దుచేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీలో నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

దేశంలో విద్యారంగాన్ని నాశనం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, తక్షణమే ఎస్ఎఫ్ఐ ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమ రథసారథి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు బొబ్బిలిలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాము సమావేశాలు ప్రారంభ సూచిక జెండా ఎగరవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యలపై పోరాడే ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుందుడుకు విధానాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం చేయకుండా విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ఇపి పేరుతో మూసివేసిన పాఠశాలలను తెరిపించాలని, డిగ్రీలో తీసుకువచ్చిన ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ కళాశాలలో ఆర్ట్స్ గ్రూప్ రద్దును ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు విద్యారంగంపై చిన్న చూపు చూడడం దారుణమని విమర్శించారు. రాబోయే ఆరు నెలల్లో విద్యారంగ సమస్యలపై పోరాటం చేయడానికి ఈ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని రద్దు చేయాలని, 9 నెలలుగా బకాయి ఉన్న మెస్ ఛార్జీలు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలని , విజయనగరంలో మహిళా జూనియర్ కళాశాల నిర్మించాలని, బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని , కార్పొరేట్ స్కూల్స్ కాలేజీల్లో ఫీజులు పుస్తకాలు నియంత్రణ చేయాలని, జిల్లాలో శిథిలావస్థలో ఉన్న వసతిగృహాల భవనాలను వెంటనే మార్చాలని, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం రాజకీయాలు అతీతంగా త్వరితగతిన నిర్మించాలని, విజయనగరం గజపతినగరం, రాజాం డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలు నిర్మించాలని, డ్రగ్స్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్, ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు మణికుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఈశ్వరరావు

జెండాను ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము

నేడు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

17 వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం తోటపాలెంలోని గాయత్రి విద్యాసంస్థల్లో జరుగుతాయని జిల్లా తైక్వాండో అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సి హెచ్ వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం ముగింపు, బహుమతి ప్రధాన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యాన తరగతుల బహిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో సెలవు రోజు శనివారం తరగతులు నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ కాలేజీ, ఎజిఎల్ డిగ్రీ కాలేజీ చైతన్య డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యాన విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్ ఆధ్వర్యాన ఆయా కళాశాలలకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఏ విద్యాసంస్థలైనా ప్రభుత్వ సెలవు దినాల్లో క్లాసులు నిర్వహిస్తే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆప్టా రాష్ట్ర అధ్యక్షులుగా గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆప్టా నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం విజయవాడలో జరిగింది. అన్ని జిల్లాల ఆప్టా ప్రధాన బాధ్యులు, కార్యవర్గ సభ్యులు హాజరై 2024 - 2026కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విజయనగరం జిల్లాకు చెందిన ఎజిఎస్ గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కర్నూలు జిల్లాకు చెందిన కె.ప్రకాశరావు ఎన్నికయ్యారు. జీవో 117ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో కలిపిన 3,4,5తరగతులను తిరిగి పాత పాఠశాలల్లో కలపాలని, జీవో 3ను పునరద్దరించి గిరిజన ప్రాంత వాసులకు న్యాయం చేయాలని, తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలని ఈ సందర్భంగా సమావేశం డిమాండ్ చేసింది.

సమిష్టిగా పనిచేద్దాం

జెడ్‌పి చైర్మన్, మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- సాలూరు

రానున్న రోజుల్లో వైసిపి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. శనివారం విజయనగరంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నివాసంలో సాలూరు, పాచిపెంట మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ ఆయన ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడే ధైర్యంగా నిలబడాలని సూచించారు. పార్టీ ఓటమికి కార్యకర్తలు ఎవరూ కుంగిపోవద్దని, నాయకత్వం అండగా వుంటుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నెలరోజులకే టిడిపి ప్రభుత్వం అరాచకాలకు తెరలేపిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ ఇప్పుడున్న టిడిపి ప్రభుత్వం హయాంలో నాయకులు హామీ ఇచ్చినట్లుగా సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగితే మంచిదేనని, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తే పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో పాచిపెంట మండల సీనియర్ నాయకులు పాచి పెంట చినబాబు, డోల బాబ్జీ, తటికాయల గౌరీశ్వరరావు, జెడ్‌పి వైస్ చైర్మన్ కె. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారులో టోల్‌ఛార్జీ బాదుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధిలో మరింత దూసుకుపోతామంటూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాలు మర్చిపోక ముందే జిల్లాలో టోల్‌గేట్ ఛార్జీల బాదుడు మొదలైంది. వారు వీరు అన్న తేడా లేదు. జిల్లాలోని ప్రతి ప్రయాణికుడూ ఇంటి నుంచి బయటకు వస్తే టోల్ బాదుడు తప్పదు. మోడీ చెప్పిన అభివృద్ధి జరుగుతుందో లేదో తెలియదుగానీ డబుల్ ఇంజిన్ సర్కారు రావడం ప్రయాణికులపై భారం మోపడం మాత్రం సులభతరంగా మారింది. ఉమ్మడి విజయనగరం అసలే ఆర్థికంగా వెనుకబడిన జిల్లా. విద్య, వైద్య సదుపాయాలు అంతంతమాత్రమే. ఉపాధి అవకాశాలు కరువే. దీంతో, ప్రతి చిన్నపనికీ, సమస్యకీ, పక్కనేవున్న విశాఖ జిల్లాపై ఆధారపడాల్సిన దుస్థితి. చాలా కాలంగా వున్న నాతవలస టోల్‌గేట్‌తో చాలా మంది ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించుకోవాల్సివస్తోంది. తాజాగా విజయనగరం - విశాఖ జాతీయ రహదారిలో జొన్నాడ వద్ద ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాతో బస్సులో ప్రయాణించే సగటు మనిషి విశాఖ వెళ్లిరావాలంటే కనీసం రూ.20 వరకు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయనగరం నుంచి విశాఖ వెళ్లే ప్రతి బస్సుకూ రానూపోనూ రూ.295 చెల్లించుకోవాల్సి వస్తోంది. దీంతో, ఇటీవల కాలం వరకు రూ.90 ఉన్న అల్ట్రా డీలక్స్ ఛార్జీ రూ.100కు పెరిగింది. సూపర్ లగ్జరీ ఛార్జీ రూ.100 నుంచి రూ.110కి పెరిగింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రస్తుతం రూ.75 చెల్లిస్తుండగా, రూ.80కి, పల్లె వెలుగు బస్సు ఛార్జీలు రూ.60 నుంచి రూ.70కి పెరిగాయి. ఈ లెక్కన విజయనగరం డిపో నుంచి 42 ట్రిప్పులు తిరుగుతున్న ఆర్టీసి బస్సులకు కేవలం టోల్‌గేటు ఛార్జీలు రూ.11,130 అదనంగా చెల్లించాల్సివస్తోంది. ఇంకా విశాఖ డిపో బస్సులపైనా ఇదే తరహా భారం ఉంటుంది. దీన్నిబట్టి విజయనగరం నుంచి విశాఖ వెళ్లి వచ్చే ప్రయాణికుడిపై రూ.20భారం పడుతోంది. ఇక కారులు, వ్యానులు, లారీలు, ఇతర వాహనాలకు ఇంత కన్నా ఎక్కువ మొత్తంలోనే వసూలు చేస్తున్నారు. ఇది కూడా కేవలం విజయనగరం నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులపై పడుతున్న భారం. ఇది చాలదన్నట్టు మానాపురంలో మరో



టోల్‌గేట్ రెడీ అవుతోంది. త్వరలోనే దీన్ని ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతుతున్నాయి. మానాపురానికి ముందు బస్సు ఎక్కే ప్రయాణికులపై రాను పోను రూ.20 అదనపు భారం. వీరు విశాఖ వెళ్లాలంటే మొత్తంగా రూ.40 వరకు అదనంగా ఆర్థికభారం మోయాల్సివుంటుంది. ఇటు ఎస్.కోట నుంచి విజయనగరం వచ్చే ప్రయాణికులకూ టోల్ ఛార్జీ వడ్డన తప్పే పరిస్థితి లేదు. విజయనగరం నుంచి బొడ్డవర వెళ్లే మార్గంలో తామరాపల్లి వద్ద కూడా మరో టోల్‌గేట్ రెడీ అవుతోంది. దీన్నిబట్టి ఎటు నుంచి ఎటెల్లినా జిల్లా వాసులకు టోల్ ఛార్జీలు తప్పే పరిస్థితి లేదు. మొత్తం టోల్‌గేట్లలో మూడుచోట్ల డబుల్ ఇంజిన్ (కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిజెపితో కూడిన కూటమి ప్రభుత్వం) సర్కారు వచ్చాక ఏర్పాటు చేస్తున్నవే కావడం విశేషం. వాస్తవానికి విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పెద్దగా విద్య, వైద్యం సదుపాయాలు పెద్దగా లేవు. సూపర్ స్పెషాలిటీ వైద్యం కావాలన్నా, ఇతర అవసరాలకు విశాఖపట్నం వెళాల్సిందే. జిల్లా వాసులు కాస్త అటవిడుపుగా సేదదీరాలనుకున్నా విశాఖ అందాల కోసం వెళ్లాల్సిందే. ఈనేపథ్యంలో విజయనగరం, విశాఖ జంట నగరాలుగా ఉన్నాయి. ఎంతో మంది ఉద్యోగులు, వ్యాపారులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈనేపథ్యంలో కేవలం బస్సు ప్రయాణికులు మాత్రమే కాకుండా కార్లు, వ్యానులు, లారీలు వంటి అన్నిరకాల వాహనాలపై టోల్ ఛార్జీల భారం పడనుంది. ఇదంతా పరోక్షంగా ప్రయాణికులు, సగటు వినియోగదారులపైనే పడుతుందనడంలో సందేహం లేదు.

ఈ నేపథ్యంలో టోల్ గెట్లును ఎత్తివేయాలని సిపిఎం, లోక్‌సత్తా డిమాండ్ చేస్తున్నాయి. జొన్నాడ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ ఇటీవల విజయనగరం ఎంపీ, ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను కలిశారు. ప్రజాభీష్టం మేరకే టోల్‌గేట్ పై నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే చొరవ ఎంత వరకు ఉంటుందో, కలెక్టర్ ఏమేరకు చొరవ చూపుతారో? వేచిచూడాల్సిందే. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో కూడా ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చారు. దీంతో జొన్నాడ టోల్‌గేట్‌ను అక్కడి నుంచి తరలించేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. అమలు తీరు ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందేనని జనం చర్చించుకుంటున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మన్యం ఎస్‌పిగా ఎస్‌వి మాధవరెడ్డి

విక్రాంత్ పాటిల్‌కు కాకినాడ బదిలీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మన్యం జిల్లా ఎస్‌పిగా ఎస్‌వి మాధవరెడ్డి రానున్నారు. మాధవరెడ్డి శ్రీ సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఈయన 2017 ఐపిఎస్ బ్యాచ్ చెందిన వారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌పిగా పనిచేస్తున్న విక్రాంత్ పాటిల్‌కు కాకినాడ జిల్లా బదిలీ అయ్యింది. విక్రాంత్ పాటిల్ జిల్లా ఎస్‌పిగా 15 నెలలు పాటు పనిచేశారు.

రైతుబజార్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేసి సబ్సిడీపై ప్రజలకు నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు బజార్ లేకపోవడంతో వ్యాపారులు అధిక ధరలకు నిత్యావసర సరుకులను అమ్మి దోపిడీ చేస్తున్నారని తెలిపారు. నిత్యావసర సరుకులను సబ్సిడీపై సరఫరా చేసి వ్యాపారుల దోపిడీని నివారించాలని కోరారు. రైతు బజార్ ఏర్పాటు చేస్తామని గతంలో పాలకులు హామీ ఇచ్చినా అమలు చేయలేదని చెప్పారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని పారాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన జట్లు చిత్తూరు జిల్లా పుత్తూరులో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నాయి. ఎంపిక పోటీలు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సుంకరి సాయి రమేష్, బాడంగి, ఆరికతోట, తూడెం పీడీలు బంగారునాయుడు, అప్పలనాయుడు, సత్యనారాయణ, వెంకటనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి ఇనగంటి విజయ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుల ముప్పాల హరి నాగేశ్వరరావు, తెర్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

జెడ్‌పి తీర్మానం అభినందనీయం

ప్రజాశక్తి -విజయనగరం కోట

జొన్నాడ వద్ద నిర్మించిన టోల్ గేట్‌ను వేరొక చోటికి తరలించాలని కోరుతూ జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించడం అభినంద నీయమని లోక్‌సత్తా నాయకులు అల్లంశెట్టి నాగభూషణం అన్నారు శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టోల్ గేట్ నిర్మాణం పనులు ప్రారంభం నుండి లోక్ సత్తా, పలు పార్టీలు, ప్రజాసంఘాలు, జిల్లా పౌర వేదిక సంయుక్తంగా టోల్ గేట్‌ను ఇక్కడ నిర్మించకూడదని కోరుతూ అనేక ఉద్యమాలు చేశాయని తెలిపారు. టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు జెడ్‌పి సమావేశంలో వినతులు ఇచ్చామని తెలిపాఉ. ఈనేపథ్యంలో తీర్మానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఎరుకులపాకలు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

జ్వరాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-బాడంగి

సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి పాలవలస గౌరు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఎరుకులపాకలు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో కలిసి జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని, డయేరియా, డెంగీ, మలేరియా వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మంత్రి శ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ శంకర్రావు

అమరావతి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కొత్త బగ్గాం గ్రామానికి చెందిన రెట్టింగి శంకర్రావు తన ఔదార్యాన్ని మరోసారి చాటుకున్నారు. గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ, పలువురు అనాధలకు తన వంతు సహాయం అందజేసిన, శంకర్రావు శుక్రవారం రాష్ట్ర ఎంఎస్‌ఎమ్ఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి అమరావతి రాజధాని నిర్మాణం కోసం విరాళంగా తన ఒక నెల జీతాన్ని 54 వేల రూపాయలు అందజేశారు. ప్రస్తుతం శంకర్రావు విజయనగరం పోలీస్ శిక్షణ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. శంకర్రావు ఔదార్యాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు శంకర్రావు బాటలో నడిచి మరికొందరు దాతలు అమరావతి నిర్మాణం కోసం విరాళాలు అందజేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మక్కువ శ్రీధర్, పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో శనివారం సిపిఐ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి విధానాలకు రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిపిఐ నాయకులు కె.ప్రసాదరావు, ఎం.శ్రీనివాస్, కె.అప్పన్న,, నాగభూషన్, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి రమణ

వారం ముందే సాగునీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గత ఏడాది ఖరీఫ్ సీజనకు సంబంధించి జులై మూడో వారంలో నీటిని విడుదల చేయగా ఈ ఏడాది వారం రోజులు ముందుగానే సాగునీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర వద్ద గల తోటపల్లి జలాశయం నుంచి కుడి కాలువ నీటిని శనివారం ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా 39 వేల ఎకరాలకు సాగునీరందుతుందని తెలిపారు. గత ఏడాది మోడరైజేషన్‌లో భాగంగా రూ.153 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి 22శాతం పనులు పూర్తి చేశామని డిఇఇ రవికుమార్ తెలిపారు. వాస్తవానికి 30మంది లస్కర్లు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కాలువ గుండా గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ, బలిజిపేట, వంగర మండలాలకు నీరు అందుతున్నారు.

తోటపల్లి కుడికాలువ ద్వారా నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఐదేళ్లలో సకాలంలో నీరు లేక ఇబ్బందులు

వివిధ మండలాలకు చెందిన రైతులు గత ఐదేళ్లలో ఎన్నడూ సకాలంలో సాగు నీరందించిన దాఖలాల్లేవని, గడిచిన ఐదేళ్లలో ఎప్పుడూ రెండు పంటలకు నీరందించిన దాఖలాలు లేవని అధికారులను రైతులు నిలదీశారు. ఎప్పుడు అడిగినా ఏదో ఒక కారణం చెప్పుకొస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు అధికారులు స్పందిస్తూ కాంట్రాక్టర్లు సకాలంలో పని చేయకపోవడం వల్ల రైతులకు నీరందించే విషయంలో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. వంగర మండలానికి సంబంధించిన రైతులు ఈ కాలువ నుంచి తాము లబ్ది పొందిన దాఖలాల్లేవని, ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు సక్రమంగా సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదన్, మ్రరావు పురుషోత్తమనాయుడు, అంబటి రాంబాబు, కోట సుమన్‌రావు, రామ్మూర్తి, పి.పాపినాయుడు, ద్వారపురెడ్డి సత్తిబాబు, పూర్ణచంద్రరావు, ఎఇఇలు కె.రాజేష్‌కుమార్, బి.శంకర్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.గౌరినాయుడు, లస్కర్ టి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కణ

ప్రజాశక్తి - జామి

మండలంలోని లొట్లపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ముందుగా మంత్రికి స్థానికులు పూలవర్షంతో బ్రహ్మరథం పట్టారు. అనంతరం విగ్రహావిష్కరణ చేసిన ఆయన బహిరంగ సభలో ప్రసంగించారు. అంబేద్కర్ సేవలు మరువరానివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు పెదబాబు, స్వామినాయుడు, వర్రి రమణ, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్, టిడిపి నాయకులు

సిరిపురంలో వన మహోత్సవం

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని సిరిపురంలో తామర చెరువు గట్టు పైన, స్వర్గధామం వద్ద, పాఠశాలల వద్ద శనివారం వన మహోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామ పెద్ద మొయ్య నారాయణప్పడు మాస్టారు, రైల్వే ఉన్నతోద్యోగి అక్కలపోతు శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామం లోని యువత, ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని, మొక్కలు నాటారు. ఎబిఎన్ ఛానల్ విజయనగరం జిల్లా ప్రతినిధిగా ఉన్న బూరాడ శ్రీనివాస రావు అటవీ శాఖ సౌజన్యంతో వేప, చింత, ఇతర పండ్ల మొక్కలను గ్రామానికి పంపించారు. గ్రామస్తులంతా ముఖ్యంగా అభ్యుదయ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతం చేసారు. ఇప్పటికే, అక్కలపోతు శ్రీరాములు ఆధ్వర్యంలోయువత తామర చెరువు గట్టు పొడవునా మొక్కలు నాటి, సంరక్షిస్తున్నారు. సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఉండే పరిసరాలను టూరిజం శాఖ అభివద్ధి చేయాలని ప్రభుత్వానికి గ్రామం నుంచి ప్రతిపాదనలు పంపారు.

మొక్కలు నాటుతున్న సిరిపురం గ్రామస్తులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోషినివాలా 94వ జయంతిని శనివారం అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అయ్యన్నపేట ఎస్‌సి కాలనీలో నిర్వహించారు. ముందుగా సభ్యులంతా తోషినివాలా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్వీన్స్ ఎన్‌ఆర్ఐ హాస్పిటల్ సౌజన్యంతో బిపి మరియు షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ డిస్ట్రిక్ట్ 102 డిప్యూటీ గవర్నర్, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థపాక అధ్యక్షులు త్యాడ రామకష్ణారావు (బాలు) మాట్లాడుతూ తోషినివాలా క్రమశిక్షణకు మారుపేరని, ఉత్తరాంధ్రలో వాకర్స్ క్లబ్‌లు అభివృద్ధి చెందడానికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు లోపింటి కళ్యాణ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. .

లక్ష రూపాయల చెక్కు అందజేస్తున సైకాలజిస్టు కె.వెంకటరావు

నిరాశ్రయుల వసతి గృహానికి విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహానికి ప్రముఖ సైకాలజిస్టు కె.వెంకటరావు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్‌కు, కార్యదర్శి సత్యంకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, రెడ్ క్రాస్ వారు సమాజానికి ఎన్నో రకాలుగా వెలకట్టలేని సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా ఆయనను అధ్యక్ష కార్యదర్శులు అభినందించారు. వీరితోపాటు పట్టణ నిరాశ్రయుల భవనం మేనేజర్ త్యాడ రామకృష్ణారావు(బాలు) పాల్గొన్నారు.

పశుగ్రాసంతో దాణా ఖర్చులు మిగులు

ప్రజాశక్తి - భోగాపురం

పశువులను పశు గ్రాసం ద్వారా పెంచితే దాణా ఖర్చులు తగ్గుతాయని ముంజేరు పశువైద్యాధికారి రామరాజు అన్నారు. ముంజేరు పశువైద్య చికిత్సాలయం పరిధిలోని నందిగాం, రావివలస, బైరెడ్డిపాలెం, గూడెపువలస రైతు సేవా కేంద్రాలలో శనివారం పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పశుగ్రాస విత్తనాలు ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో ఇప్పటికీ టన్ను పశుగ్రాస విత్తనాలు రాయితీపై పంపిణీ చేస్తున్నామన్నారు. పశుగ్రాసం ద్వారా పాడి పశువులను మేపితే అధిక లాభాలున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి రామరాజు

పలుచోట్ల కుండపోత వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న కాలువల నీరు రహదారిపైకి పొంగిపొర్లింది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వర్షం నీటితో చెరువును తలపించింది.

సీతంపేట: మండలంలో శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రంగా ఎండ కాసినప్పుడికీ మధ్యాహ్నం సమయంలో ఒకసారి మేఘాలు చిమ్మ చీకటిగా మారి వాతావరణం చల్లబడి ఒకసారిగా 12 గంటల నుండి ఒంటి గంటన్నర వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుండపోత వర్షం కురవడంతో ఆకు తయారు చేయడానికి ఉపయోగ పడుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

నెల్లిమర్లలో గంజాయి బ్యాచ్ హల్‌చల్

కారు అద్దాలు ధ్వంసం ప్రయాణికులపై దాడి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్లలో గంజాయి బ్యాచ్ శనివారం హల్‌చల్ చేసింది. ప్రయాణికులపై దాడి చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు కారు అద్దాలను ధ్వంసం చేసింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. స్థానిక చర్చి సమీపంలో శుక్రవారం రాత్రి సమయంలో గంజాయి బ్యాచ్ రహదారి మీద అడ్డుగా ఉండి కారులో ప్రయాణం చేస్తున్న బొడ్డు సూర్యా రావు కుటుంబంపై దాడి చేసి రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్యారావు పాలకొల్లు నుంచి చీపురుపల్లి మండలం ఇటకర్ల పల్లిలో బంధువులు చనిపోవడంతో పరామర్శకు వెళ్తుండగా సంఘటన చోటు చేసుకుంది. డబ్బులు లేవని చెప్పడంతో దుండగులు కారు అద్దాలు పగల గొట్టారు. కారులో ఉన్న మహిళలు, డ్రైవర్ గాయపడ్డారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అద్దాలు ధ్వంసమైన కారు

Tirumala MEDICOVER HOSPITALS

NEWS ITEM

As the retention period of the Medical Records for the year 2015 to 2016 in **Tirumala Medicover Hospitals,** Vizianagaram is over, if anyone wants the information in the above mention period of Medical Records, they should come to the hospital and meet the Medical Superintendent within 30 days from date of publication. We hereby inform you that all the Medical Records will be permanently removed from the records from that date.

DR. SHEREEN HASAN BHAT, Medical Superintendent,
TIRUMALA MEDICOVER HOSPITALS, VIZIANAGARAM.
Tirumala Medicover Hospitals, #8-24, P.S.R. Complex, Lower Tank Bund Road, VIZIANAGARAM-535 003.

దేవాదాయశాఖ భూమిని పరిశీలిస్తున్న కౌలు రైతు, రైతు సంఘం నాయకులు రాములు, గోపాలం

సాగుదారులకే దేవాదాయ శాఖ భూములివ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

దేవాదాయ శాఖ భూములు పూర్వం నుంచి సాగు చేస్తున్న రైతులకే ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాతబొబ్బిలి, గొల్లపల్లిలో రైతులు సాగు చేస్తున్న దేవాదాయ శాఖ భూములను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో దేవాదాయ శాఖ భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబాలకే సాగు హక్కు కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ వేలం వేసి ఎక్కువ కౌలు ఇస్తున్న వారికి కేటాయించడం అన్యాయమన్నారు. గతంలో రైతులు చెల్లిస్తున్న కౌలుకు 13శాతం పెంచి వారినే కొనసాగించాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేలం వేయడం వల్ల సన్న, చిన్నకారు రైతులు అందులో పాల్గొనే పరిస్థితి లేదన్నారు. వేలంతో సన్న, చిన్నకారు రైతులు దేవాదాయ శాఖ భూముల నుంచి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగు చేస్తున్న రైతులకు భూములు ఇచ్చి, కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేష్, రైతులు పాల్గొన్నారు.

కెజిబివిలో పిల్లర్లు వేసి వదిలేసిన నిర్మాణం

అర్ధాంతరంగా భవన నిర్మాణాలు

తరగతుల నిర్వహణకు ఇబ్బందులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో మనబడి నాడు-నేడు కార్యక్రమంలో రెండో విడతలో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల విడుదలలో జాప్యంతో పనులు ముందుకు కదలడం లేదు. దుంగాడ ఎంపిపి పాఠశాల భవనం, బక్కునాయుడుపేటలో కెజిబివి అదనపు గదుల నిర్మాణానికి నాడు-నేడు రెండో విడతలో ఎంపికచేశారు. రెండో విడత నిధులు పూర్తిగా మంజూరు కాకపోవడంతో దుంగాడ ఎంపిపి పాఠశాల భవనం మెట్లు, లోపల ప్లాస్టింగులు, కిటికీలు, తలుపులు పూర్తి చేయలేదు. కెజిబివిలో అదనపు గదులకు పిల్లర్లు వేసి నిలిపేశారు. దీంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ఈ విషయంపై ఎంఇఒ పి.బాలభాస్కరరావును వివరణ కోరగా, సిమెంట్ కోసం ప్రతిపాదన పంపించామన్నారు. సిమెంట్ వచ్చిన వెంటనే పనులు పూర్తిచేస్తామని చెప్పారు.

విద్యాశాఖ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యా శాఖ కార్యాలయ ఆవరణలో విద్యా శాఖ ఉద్యోగుల సంఘం సమావేశం శనివారం కార్యాలయ పర్యవేక్షకులు బి.బి.భాస్కరరావు ఆధ్వర్యాన జరిగింది. సమావేశంలో సంఘం పనితీరు, బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పాతికేళ్లుగా జిల్లాలో సూపరింటెండెంట్‌గా వివిధ కేడర్లలో పనిచేసి, పశ్చిమ గోదావరి జిల్లాలో ఎడిగా, డైట్ ప్రిన్సిపల్‌గా, డిఇఒగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆర్.వి.రమణను డిఇఒ ప్రేమకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ ఎడిలు బి.గౌరీశంకరావు, టి.వి.శ్రీనివాసరావు, కార్యాలయ, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వి రమణను సన్మానిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్, సిబ్బంది

గడ్డి మందుతాగి రైతు మృతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

విజయనగరం జిల్లా వంగర మండలం పెద్ద రాజుల గుమ్మడ గ్రామానికి చెందిన రైతు రెడ్డి కృష్ణమూర్తి (46) మృతి చెందాడు. శనివారం తన పొలంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని చూసిన ఆయన సోదరుడు రెడ్డి కూర్మినాయుడు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No.1684/2022 in A.S.No.137/2016

Between:
శ్రీ కోరంగేశ్వరస్వామి టెంపుల్, కోరంగి గ్రామం, Rep. by its Executive Officer ...అప్పిలెంట్/పిటిషనర్

మరియు

చంద్రాల గణేశ్వరరావు (died) & వగైరాలు ...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్

To: రెస్పాండెంట్స్:
R2: శ్రీమతి చంద్రాల శేషారత్నం, W/o. గణేశ్వరరావు, C/o. చిలకా వెంకటేశ్వరరావు, చిన్నయ్యగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.
R3: శ్రీమతి యార్లగడ్డ సూర్యకుమారి, W/o. శ్యామ్‌కుమార్, సిద్ధార్థ నగర్, విజయనగరం బస్‌స్టాండ్ దగ్గర, మెయిర్‌రోడ్, విజయనగరం-531202, (A.P.)
R4: శ్రీమతి కోరంగి అరుణ, W/o. సతీష్, M.G. రోడ్, చంద్రమౌళిపురం, శ్రీరామ్ నగర్, బెంజ్ సర్కిల్, విజయవాడ - 520 010

పై నెంబరు అప్పీల్‌లో 1వ రెస్పాండెంట్ చంద్రాల గణేశ్వరరావు గారు చనిపోయినందున వారి వారసులైన మిమ్ములను చేర్పించమని కోరుచూ దాఖలుచేసిన పిటిషన్‌పై మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.22-07-2024 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమందు విచారించి తీర్మానించడమగును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

మిత్తిపాటి వెంకట విశ్వేశ్వర సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, డో.నెం.2-46-7
విళ్ళవారి వీధి, వెంకట్‌నగర్
కాకినాడ - 533 003

కాకినాడ
13-07-2024